క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా డి.పోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డి.పోచంపల్లి 60 గజాలు, 120 గజాలు, సాయిపూజ కాలనీ, డాక్టర్ బస్తీ, శివశక్తి కాలనీ, గండిమైసమ్మ చౌరస్తా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెర్టెక్స్ వేద అపార్ట్‌మెంట్స్, మిర్చి డెవలపర్స్, అక్షయ డెవలపర్స్, గురుకుల్ పాఠశాల, విశ్వసాయి టౌన్‌షిప్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన వీర్ భగత్‌సేవా సంఘం సభ్యులు

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఆదివారం వీర్ భగత్ సేవా సంఘం ఆధ్వర్యంలు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, మైనంపల్లి హనుమంతరావు, కొలను హన్మంతరెడ్డి, ఎస్ఐ మహేశ్‌గౌడ్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీర్ భగత్ సేవక్ ప్రతినిధులు వంశీకృష్ణ, భాస్కర్‌రావు, సురేశ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, శివరాజ్, మీరా రావు, జశ్వంత్, స్వాతిక్, లోకేశ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ బలోపేతానికి కృషి చేస్తాం



జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జ్ కన్వీనర్‌గా ఎండీ వాజిద్ నియమితులయ్యారు. ఆదివారం ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జ్ డా. దిడ్డి సుధాకర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వాజిద్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, మహ్మద్ మాజీద్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాత భవనాలపై అదనపు అంతస్తులు



రంగానగర్‌లో పాత భవనంపై చేపడుతున్న అదనపు ఫ్లోర్ల నిర్మాణం

చింతల్: డివిజన్ పరిధిలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇవి శ్రీసాయికాలనీ, రంగానగర్, భగత్‌సింగ్‌నగర్, వివేకానందనగర్ తదితర బస్తీల్లో ఎక్కువ. కొంత మంది ఇళ్ల యజమానులు 23ఏళ్ల తర్వాత తిరిగి మరలా రెండు, మూడు ఫ్లోర్లు వేస్తున్నారు. పాత భవనాలపై అదనపు అంతస్తులు నిర్మిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. మరి అధికారులు ఇప్పటికైనా పట్టించుకుంటారో లేదో వేచి చూడాలి.

ప్రొ. జయశంకర్ సార్‌కు ఘన నివాళి

ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని కుత్బుల్లాపూర్ జోన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి మార్గనిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి నేడు మన మధ్య లేకున్నా ఆయన ఆశయాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వక్తలు కోరారు. తెలంగాణ వేదిక అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉద్యమకారులు కృష్ణారెడ్డి, నరసింహులు, లక్ష్మారెడ్డి, మాణిక్యం, వెంకటేష్, సంపత్, నాగిరెడ్డి, జానయ్య, సిద్దిరామాచారి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆదివారం అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– కుత్బుల్లాపూర్



అసెంబ్లీ హాల్‌లో జరిగిన జయశంకర్ జయంతిలో మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక సభ్యులు

మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం

దుండిగల్: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మల్లంపేట 23వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. యుద్ధప్రాతిపదికన అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మిగిలిన పనులను సైతం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వార్డు పరిధిలోని వివిధ బస్తీల్లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంతస్వామి, మాదాసు వెంకటేశం, నేతలు ఎంబరి ఆంజనేయులు, హన్మంతరావు, రంగయ్య, రాఘవేందర్, రమేశ్, బాలకృష్ణ, శ్రీను, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

వైభవంగా నల్లపోచమ్మ ఆలయ బోనాలు

నిజాంపేట్: బోనాల తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. నల్లపోచమ్మ దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, సాయికృష్ణారెడ్డి, శ్రీధర్, సునీల్, బీజేపీ నేతలు బుచ్చిరెడ్డి, ఆకుల సతీష్, కాశి, హన్మంతు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీనగర్‌లో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

అ'పూర్వ' సమ్మేళనం

సుభాష్‌నగర్: దూలపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2003–04 బ్యాచ్‌కు చెందిన 25 మంది విద్యార్థులు ఒకే చోట చేరి కేక్ కట్ చేశారు. అనంతరం 20 సంవత్సరాల క్రితం పాఠశాల అనుభవాలను నెమరువేసుకుంటూ సందడిగా గడిపారు. మధ్యాహ్నం స్కూల్ ఆవరణలో సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.



అమరవీరుల స్ఫూర్తితో ప్రజల పక్షాన పోరాడతాం

మియాపూర్: అమరవీరుల స్ఫూర్తితో ప్రజల పక్షాన ఉండి పోరాడదామని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ పేర్కొన్నారు. ఎంఏనగర్‌లోని ఎంసీపీఐయూ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మియాపూర్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా ఇస్లావత్ దశరథ్ నాయక్, సహాయ కార్యదర్శిగా పల్లె మురళీ, కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య పారిశ్రామిక షెడ్ల నిర్మాణం

జీడిమెట్ల: నివాసాల మధ్య అడ్డగోలుగా వాణిజ్య, పారిశ్రామిక షెడ్లను నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా షెడ్లను నిర్మించడం పట్ల సుభాష్‌నగర్ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అయినా నిర్మాణం యథావిధిగా సాగించడం పట్ల కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఇళ్ల మధ్య పూర్తిగా షెడ్ల నిర్మాణాలు జరుగుతాయని అంటున్నారు. శబ్ద, వాయు కాలుష్యంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకుని సదరు నిర్మాణాన్ని నిలిపేయాలని ప్రజలు కోరుతున్నారు.



సుభాష్‌నగర్‌లోని రెసిడెన్షియల్ జోన్‌లో నిర్మిస్తున్న ఓ షెడ్డు

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి సూచించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఎస్‌బీఐ విశ్రాంత అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వారికి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్లు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరూ ప్రతినిత్యం వాకింగ్, యోగా, ధ్యానం వంటి కూడా చేయడం చాలా అవసరమన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక వ్యాధులు సంక్రమిస్తూ ఉన్నాయని, వాటి పట్ల అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా 500 మంది ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలను అందించారు. ముఖ్యంగా ఎండోక్రైనాలజీ, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలోజీ, న్యూరాలోజీ, గైనకాలజీ, పల్మనాలోజీ, ఇంటర్నల్ మెడిసిన్, ఫిజియోథెరపీ వంటి నిపుణులతో వైద్య సేవలను అందించడంతోపాటు అవగాహన కల్పించారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి సొంత నిధులు

బాలానగర్: ప్రజా సమస్యల పరిష్కారానికై సొంత నిధులు రూ.2లక్షలు సహాయం చేయటం తన కర్తవ్యంగా భావిస్తున్నానని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురం కాలనీవాసుల 11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల పనులకు ఆయన నిధులు అందజేశారు. వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు కాలనీవాసులు అభినందనలు తెలిపారు. సయ్యద్ ఇమ్రాన్, జగన్‌గౌడ్, సలీమ్‌ఖాన్, అన్వర్, షౌకత్, నాయకులు సంతోష్, శివరామ్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

దుర్గం చెరువు వద్ద జాతీయ వాస్కులర్ డే

మాదాపూర్: ఫోన్‌లు, కంప్యూటర్‌లతో జీవన విధానమే మారిపోయిందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ వాస్కులర్ డేను పురస్కరించుకుని శస్త్రచికిత్స రహిత ఇండియా థీమ్‌తో ఆదివారం వాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. రోగం లేని సమాజం కోరుకుందామన్నారు. గతంలో రెండు కిలోమీటర్లు దూరం ఉన్నా నడిచివెళ్లేవారని.. ఇప్పటి పిల్లల్లో ఆ పరిస్థితి లేదన్నారు. ఏసీపీ కేఎస్ రావు మాట్లాడుతూ.. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పీసీ గుప్తా, చీఫ్ ఆర్గనైజర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జాతీయ వాస్కులర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్రనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

● కూకట్‌పల్లి జెడ్‌సీ మమత



ఆల్వాల్‌లో జరిగిన కళాకారుల కార్యక్రమానికి గద్దర్‌కు స్వాగతం పలుకుతున్న జెడ్‌సీ (ఫైల్)



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో మమతను కలిసిన గద్దర్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమ సమయంలో మాతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్న విషయం మర్చిపోలేము. ఇటీవల స్వర్ణోత్సవాల్లో భాగంగా అల్వాల్ సర్కిల్ పరిధిలో కళాకారులను సన్మానించుకునే కార్యక్రమానికి గద్దర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలు సందర్భాల్లో కూకట్‌పల్లి జోనల్ కార్యాలయానికి వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. ఎలా ఉన్నావు అమ్మ అంటూ ఎప్పుడూ ఆప్యాయంగా పలకరించే గద్దర్ ఇక లేడు అన్న విషయం చాలా బాధగా ఉంది అంటూ జోనల్ కమిషనర్ మమత తన జ్ఞాపకాలను సాక్షితో పంచుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రంగారెడ్డినగర్: దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఉమారాణి అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ నందానగర్‌లోని కమ్యూనిటీ భవనంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ.. ఇంటి ఆవరణ, చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. పూల కుండీలు, పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో వర్షపునీరు చేరి దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా వాటి వ్యాప్తిని అరికట్టి వ్యాధులు దరి చేరకుండా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ అబ్దుల రజాక్, నందానగర్ ప్రెసిడెంట్ కార్తీక్‌గౌడ్, కమిటీ సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారి ఉమారాణి

ఘనంగా రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న వేదపండితులు



యాగంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన పూజా కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చండీ యాగంలో పలువురు పాల్గొని పూజలు చేయగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కాలనీ మహిళలు కలిసి నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రేణుకాఎల్లమ్మ ప్రతిష్ఠ మహోత్సవం రెండేళ్ల క్రితం ప్రారంభం కాగా ఇక్కడ రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్న ప్రగాఢ విశ్వాసం ఉంది.



రేణుకాఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన



హాఫీజ్‌పేట్: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరీకరణ పనులకు ఆదివారం వర్చువల్ కార్యక్రమంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రారంభోత్సవానికి శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్, మొవ్వ సత్యనారాయణ, జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో 21 స్టేషన్‌లకు సంబంధించిన ఆధునీకరణ పనులను ప్రధానీ నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఆధునీకరించడంతో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పించనున్నారన్నారు. హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏబీఎస్ఎస్ పథకం కింద ఎంపిక చేశారన్నారు. 12 వేల ప్రయాణికుల సంఖ్యతో సుమారు 96 రైళ్ల సర్వీసుల రాకపోకలు సాగిస్తున్నారన్నారు. సబర్బన్ స్టేషన్‌గా అభివృద్ధి చెంది, నగరంలోని పశ్చిమ ప్రాంతాల్లోని ప్రయాణికుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌ను రూ.26.60 కోట్లతో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ దుకాణాలు, ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.

ఓటరు నమోదుకు స్పందన

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్‌లో ఆదివారం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బీఎల్ఓలు విమల, సరిత, కవితల ఆధ్వర్యంలో 18 సంవత్సరాల వయస్సు నిండి వారికి ఓటర్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. అదే విధంగా అడ్రస్ మార్పు, ఓటర్‌కు ఆధార్ లింకేజీలను సైతం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, నేతి శంకర్‌గుప్తా, డాక్టర్ సత్యనారాయణ, గణేష్, యాదగిరి, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

చుట్టూ పచ్చదనం.. చూడు చెరువందం

కుత్బుల్లాపూర్: చుట్టూ పచ్చని కొండలు మధ్యలో స్వచ్ఛమైన నీటితో ఉన్న చెరువు చూపరులను కట్టిపడేసినట్టు ఉంది కదూ. గాజులరామారం విలేజ్, లాల్‌సాహెబ్ గూడ మధ్యలో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చింతలచెరువు ఇది. ప్రతి వర్షాకాలంలో పచ్చటి వాతావరణం మధ్య ఇలా కనువిందు చేస్తుంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ ప్రాంతాల్లోని అన్ని చెరువులు మురికిమయంగా మారాయి. మురుగునీరు కలవని చెరువు ఇది ఒక్కటే అని స్థానికులు చెబుతున్నారు.



ఎత్తైన పచ్చని కొండల నడుమ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్న చింతల్ చెరువు

వృథా కాకుండా.. ఉత్తమ ఉపాయం



సుభాష్‌నగర్: ప్రతి వర్షపునీటి చుక్కను ఒడిసి పట్టి తమ అవసరాలకు ఉపయోగించుకుంటే నీటి సమస్య అనేది మనకు రేపటి తరానికి ఉండదనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పవచ్చు. గాజులరామారం డివిజన్ నరసింహ బస్తీలో ఓ వ్యక్తి తనకున్న 60గజాల ఇంటిపై పడే వర్షపునీరు వృథా కాకుండా కాపాడుతున్నాడు. ఇంటిపై నుంచే వచ్చే నీటికి ఒడిసి పట్టేందుకు ఒక పైపు అమర్చాడు. ఆ నీటిని డ్రమ్ములో నింపుతున్నాడు. ఖర్చు చిన్నదిగా అనిపించినా ఇతను చేసిన ఉపాయం పలువురిని ఆలోచింపజేస్తోంది.

వృథా చేస్తూ.. నిర్లక్ష్యానికి నిదర్శనం



చింతల్ మార్కెట్ రోడ్డులోని నాలా కల్వర్ట్ వద్ద పైపులైన్ వాల్వ్ నుంచి వృథాగా పోతున్న నీరు

రంగారెడ్డినగర్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్‌లు, మ్యాన్‌వాల్వ్‌ల లీకేజీలతో తాగునీటి వృథా కొనసాగుతూనే ఉంది. చింతల్ మార్కెట్ రోడ్డులోని నాలా కల్వర్ట్ వద్ద తాగు నీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్‌కు లీకేజీ ఏర్పడింది. కొన్ని రోజులుగా తాగు నీరు వృథా అవుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

జలపాతం కాదు.. గల్లీ రోడ్డు



రావినారాయణరెడ్డినగర్‌లో జలపాతాన్ని తలపిస్తూ పారుతున్న వరదనీరు

సుభాష్‌నగర్: ఈ చిత్రాన్ని చూస్తుంటే మంచినీటి పైపులైన్ పగిలి పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతున్నట్టు అనిపిస్తుంది కదూ. ఇటీవల కురిసిన వర్షానికి గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్, ప్రగతినగర్ ప్రాంతాల నుంచి స్వచ్ఛమైన వరద నీరు రావినారాయణరెడ్డి నగర్‌లో సీసీ రోడ్డును దూకుతూ చిన్నపాటి జలపాతంగా కనువిందు చేస్తోంది. వర్షాకాలం మొత్తం ఇక్కడ ఇలానే ప్రవహిస్తుండటం విశేషం.